క్లుప్తంగా

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే



ముఖ్యమంత్రి రేవంత్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి.. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఐ సఫర్డ్, ఐ లర్న్‌డ్, ఐ ఛేంజ్‌డ్ అనే నినాదంతో ప్రత్యేకంగా రూపొందించిన రేవంత్ చిత్రపటాన్ని సీఎంకు బహూకరించారు. రేవంత్‌ను కలిసిన వారిలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి ఉన్నారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పరిగి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షకు పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రానున్నారని వెల్లడించారు. ఉదయం 11 గంటలకు పట్టణంలోని శారద గార్డెన్‌లో సమావేశం జరగనుందని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

జీవాలకు టీకా తప్పనిసరి

ధారూరు: గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని వెటర్నరీ డాక్టర్ స్వర్ణలత సూచించారు. గురువారం ఆమె మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ముందస్తుగా టీకా వేయించాలని పేర్కొన్నారు. ఈ నెలలో 3,423 పశువులకు చికిత్స చేశామని, 26 దూడలకు విత్తులు కొట్టామని ఆమె వెల్లడించారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న నాయకులు

అనంతగిరి: రంజాన్ సందర్భంగా వికారాబాద్ మున్సిపల్ పరిధి మధుకాలనీలో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖర్జూర పండ్లు తిని, ఉపవాస దీక్ష విరమించారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్ ఉన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- ఇష్టారాజ్యంగా సీసీరోడ్ల నిర్మాణం
- వందశాతం రోబో సాండు వినియోగం!
- క్యూరింగ్ మరచిన కాంట్రాక్టర్లు
- మూణ్నాళ్ల ముచ్చటగా మారిన సీసీలు



దుగ్గాపూర్‌లో వేసిన రోడ్డు దుస్థితి



పది రోజులకే అంచులు రాలిపోతున్న సీసీరోడ్డు

పెద్దేముల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. నాణ్యత లోపించి పెచ్చులు ఊడుతున్నాయి. కనీసం క్యూరింగ్ కూడా సక్రమంగా చేయడం లేదు. 50 శాతం ఇసుక, మరో 50శాతం రోబో సాండుతో సీసీ వేయాల్సి ఉంటుంది. కానీ.. నిర్మాణ దారులు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. 100శాతం రోబో సాండుతోనే రోడ్లను నిర్మిస్తూ.. చేతులు దులుపుకొంటున్నారు.

నిధుల దుర్వినియోగం

మండల పరిధిలో సుమారు రూ.3 కోట్లతో సీసీరోడ్లతో పాటు మురుగు కాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ పథకం కింద మండలానికి సుమారు రెండు కోట్ల మేర నిధులు మంజూరు చేసింది. ఆ పనులూ ముగిశాయి. ఇలా ఏటేటా ప్రభుత్వం అభివృద్ధి పనుల పేరిట గ్రామాలకు కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వలన ఆ ధనం దుర్వినియోగం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నిధులతో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులు అంతర్గత సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణాల్లో నాణ్యతా డొల్లతనం స్పష్టంగా కనబడుతోందని ప్రాంత ప్రజలు, స్థానిక నాయకులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

హెచ్చరికలతో సరి..

సీసీ నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు.. ఇసుకకు బదులు 100శాతం రోబో సాండుతో రోడ్డు వేయటం, వాటికి క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదు. దీని వలన ఆ రోడ్లు కొంత కాలానికే నెర్రెలు బారడం, అంచులు కూలడం లాంటి, ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా.. అడిగేవారు లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట. పాడిందే పాట. మీది మాటలకు.. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపి వేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ వాటిని ఆచరించడం లేదు. దీంతో నిర్మాణ దారులు ఇష్టంగా, యథేచ్ఛగా నాసిరకం పనులు చేపట్టి, బిల్లులు దండుకుంటున్నారు. దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యమేనని, కొందరు కాంట్రాక్టర్లతో చేతులు కలపడంతోనే ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సీసీరోడ్ల నాణ్యత విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై.. పెద్దేముల్ పంచాయతీ రాజ్ ఏఈ సిద్దార్థను వివరణ కోరగా.. పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు నిలిపి వేస్తామని వెల్లడించారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఫలాలు

ఖర్జూర పండు.. పోషకాలు మెండు

- మార్కెట్లో విరివిగా లభ్యం
- రంజాన్ మాసంలో డిమాండ్

తాండూరు: అధిక పోషకాలు ఉన్న ఖర్జూర పండ్లు మార్కెట్లో హాటుహాటుగా అమ్ముడుపోతున్నాయి. ముఖ్యంగా రంజాన్ మాసంలో.. ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు, ఖర్జూర పండు తిని దీక్షలను విరమిస్తారు. దీంతో ఈ సీజన్‌లో ఖర్జూరకు అధిక డిమాండ్ ఉంటుంది. దీక్ష చేపట్టే ముస్లింలు.. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఘన, ద్రవ పదార్థాలు తీసుకుకోకుండా.. కఠినమైన దీక్ష చేస్తారు. సాయంత్రం ఇఫ్తార్‌లో భాగంగా ఈ పండ్లను ఆహారంగా తీసుకుంటారు. ఉపవాసం చేసేవారు.. ఖర్జూర పండుతిని దీక్ష విరమించాలని ఖురాన్‌లో ఉండటంతో ప్రతిగా.. ప్రతి ముస్లిం దీనిని ఆచరిస్తారు. ముస్లింల ఆరాధ్యుడు మహమ్మద్ ప్రవక్త, ఈ పండుతోనే దీక్షను విరమించారని, అదే సంప్రదాయాన్ని తామూ కొనసాగిస్తున్నామని ముస్లింలు స్పష్టం చేస్తున్నారు.

రూ.4 వేల వరకు..

సుమారు 8రకాల ఖర్జూర పండ్లు అందుబాటులో ఉన్నాయి. తాండూరు మార్కెట్‌లో ఒక కిలో ధర రూ.200 నుంచి రూ.1,000 వరకు పలుకుతోంది. ఇతర దేశాల నుంచి వచ్చే వాటికి ఒక కిలోకు రూ.2వేల నుంచి రూ.4 వేల వరకు పలుకుతోందని వ్యాపారులు పేర్కొన్నారు.

తింటే ఆరోగ్యం..

నిత్యం 5 ఖర్జూర పండ్లను తినడం వలన రోజంతా శక్తి లభిస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వీటిని తినడం వలన గాయాలు సైతం నయం అవుతాయని వెల్లడిస్తున్నారు. గుండెను భద్రంగా ఉంచుతుందని, బరువు తగ్గడానికి, కంటి చూపు మెరుగు పర్చడానికి, రక్తపోటు అదుపులో ఉంచడానికి ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. మొత్తంగా రోగ నిరోధక శక్తిని పెంచుతుందని స్పష్టం చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎంపీఓ సోమలింగం

సాక్షి ఎఫెక్ట్..

దోమ: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీఓ సోమలింగం అన్నారు. గురువారం 'సాక్షి'లో 'అడుగంటిన ఆశలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మోత్కుర్‌లో నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి రామును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న బోర్ల నుంచి గ్రామస్తులకు సరిపడా నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఏ వార్డులో నీరు సక్రమంగా రావడం లేదో.. ఆ ప్రాంతంలో నూతన బోరు వేయించి, నీటి సమస్యను తీర్చాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను సేకరించి, డంపింగ్ యార్డ్‌కు తరలించాలని పేర్కొన్నారు.



వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీఓ సోమలింగం తదితరులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు

సూపర్‌వైజర్ అనురాధ

చేవెళ్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా .. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ క్షేమంగా ఉంటారని అనురాధ చెప్పారు. గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు సుజాత, మహిళలు, గ్రామస్తులతో పాటు కమ్మెట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశవర్కర్లు ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్: రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడమేనని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్‌ల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నిత్యం ఎన్నో ప్రమాదాలు జరిగి, సమయానికి రక్తం అందక ఎంతో మంది చనిపోతున్నారని.. రక్తదానం చేయడంతో అలాంటి వారి ప్రాణాలను కాపాడగలమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. ఈ సందర్భంగా 72 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ పీఓలు మల్లారెడ్డి, రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అప్పారి' ఆశయాలను కొనసాగిద్దాం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: తన జీవితాన్ని ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేసిన యూటీఎఫ్ నాయకుడు అప్పారి వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో గురువారం అప్పారి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటప్ప మాట్లాడారు. నేటి తరానికి వెంకటస్వామి ఎంతో ఆదర్శనీయులన్నారు. వేసవి సెలవులు ముగిసేవరకు ఉపాధ్యాయ బదిలీలను చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా క్యాదర్శులు శివారెడ్డి, నర్సింలుగౌడ్, నాయకులు కృష్ణయ్య, బాలయ్య, చంద్రశేఖర్, శేఖర్‌గౌడ్, కృష్ణ, నర్సింలు, సమత, అరుణ, కవిత, శివలీల, సుభాషిణి, కల్యాణి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, వేణు, శ్యామాచారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీల ఎంపిక



నూతన కమిటీ సభ్యులు

కొందుర్గు: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాకేశ్ ఆధ్వర్యంలో గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన పార్టీ మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడిగా దప్పు రవీందర్, కో–కన్వీనర్లుగా రాములు, విజయ్, శివ, కోశాధికారిగా సంజీవ, మీడియా ఇన్‌చార్జిగా రమేశ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కన్వీనర్‌గా చెనగళ్ల గిరి, కో–కన్వీనర్‌గా నర్సింహ, మీడియా ఇన్‌చార్జిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అణగారిన వర్గాలు అభివృద్ధి చెందాలంటే ధర్మ సమాజ్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, శ్రీను, సాయిలు, సత్యం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక విద్యకు అధిక ప్రాధాన్యం

డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శాస్త్రవేత్త బాలమురళీకృష్ణన్

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యతనిస్తే మంచి ప్రయోజకులవుతారని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ బాలమురళీకృష్ణన్ పేర్కొన్నారు. మంగళపల్లి సమీపంలో గల సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగబోయే సీఏ న్షియా–2024 పేరుతో సాంకేతిక సంబురాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడ్డితో కలిసి బాలమురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాసా రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్కం శివారెడ్డి పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సయ్యద్ సాధిక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత సయ్యద్ సాధిక్, నాయకులు భీమిడి అశోక్‌రెడ్డిలతో పాటు సుమారు 500 మంది శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోని చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి చాలా మంది నేతలు అధికార పార్టీలో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలను నమ్మడం లేదన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో చల్లా గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, పురుషోత్తంరెడ్డి, ఖాదర్‌గోరి, శివశంకర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎమ్మెల్సీ ఉపపోరు!

క్యాంపు రాజకీయాలు షురూ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వ్యూహ ప్రతివ్యూహాలు
- గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష
- ఈ నెల 28న పోలింగ్, ఏప్రిల్ 2న కౌంటింగ్



షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. పోలింగ్‌కు వారం రోజుల గడువు మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నేతలను క్యాంపులకు తరలించడం ప్రారంభమైంది.

ఆపరేషన్ ఆకర్ష

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్‌లు బరిలో ఉన్నాయి. అయితే ఈ ఉప ఎన్నికలో ఎలాగైనా విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో ఉండగా, బీఆర్ఎస్ తన నేతలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన వారే అధికంగా ఉండటంతో హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను చేపట్టింది. గులాబీకి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లను కాంగ్రెస్ నేతలు తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. దీంతో ఉపఎన్నిక పోరు రసవత్తరంగా మారింది. నేతలు ఎప్పుడు ఏ పార్టీ మారుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీల వారు ఉప ఎన్నికల్లో తమదే గెలుపు అని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపులకు తరలివెళ్తున్న నాయకులు

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఈ నెల 28న జరగనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను క్యాంపులకు తరలిస్తున్నారు. షాద్‌నగర్ నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు నాయకులకు ప్రత్యేక బస్సుల్లో క్యాంపులకు తరలిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు నాయకులను గోవా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు క్యాంపులకు విడతల వారీగా పంపించారు. క్యాంపులకు తరలివెళ్లే వారిని ఓ కంటకని పెడుతూ ఇతర పార్టీల నేతల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



క్యాంపులకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన నిర్దవెల్లి ఎంపీటీసీ కిష్టమ్మ

షాద్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణకు ఎన్నికల సంఘం అధికారులు షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో షాద్‌నగర్‌తో పాటు ఆమనగల్లు పరిధిలోని మొత్తం మూడు మున్సిపాలిటీలు, పది మండలాలకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మొత్తం 171 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, ఏప్రిల్ 2న కౌంటింగ్ నిర్వహిస్తారు.

మొదటి ప్రాధాన్యత ఓటుకే..

ఎమ్మెల్సీ ఉప పోరులో ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు, రెండో ప్రాధాన్యత ఓటు, మూడో ప్రాధాన్యత ఓటు ఉంటుంది. మొత్తం పోలైన ఓట్లలో సగం కంటే ఒకటి అదనంగా ఎక్కువగా మొదటి ప్రాధాన్యత ఓటు వస్తే ఆ అభ్యర్థి మొదటి రౌండ్‌లోనే విజయం సాధిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో పోలైన వాటిలో సగం కంటే తక్కువగా వస్తే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎవరికి సగానికిపైగా ఓట్లు వస్తే వారు విజయం సాధిస్తారు. ఉప ఎన్నిక పోరులో జిల్లాలో మొత్తం 1,439 ఓట్లు ఉన్నాయి. అన్ని ఓట్లు పోలైతే మొదటి ప్రాధాన్యత ఓటర్లతో గెలవాలంటే కనీసం ఆ అభ్యర్థికి 721 ఓట్లు రావాల్సి ఉంటుంది. బరిలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేయాలని అభ్యర్థిస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధి రాయికల్ టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాల్లో అక్రమంగా నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మద్యం రవాణా చేయడం నేరమన్నారు. అక్రమ రవాణా చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగదు, నగలను వాహనాల్లో రవాణా చేయాల్సి వస్తే, దానికి సంబంధించిన పూర్తి ఆధారాలను చూపించాలని సూచించారు. లేని పక్షంలో వాటిని సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి తనిఖీలను చేపడుతున్నట్లు వెల్లడించారు.



హోలీ సంబురాల్లో మహిళలు

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి

అనంతగిరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా చదివించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం వికారాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, హోలీ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుల ముఖ్య అతిథిగా పాల్గొని, కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, వక్త శ్రీలతారెడ్డి, సంఘం కొడంగల్ అధ్యక్షురాలు కటకం స్వప్న, సంఘం ప్రతినిధులు సరాపు శైలజ, సోమ మేఘమాల, మట్పూరి అనురాధ, కుంచం దీప, వాసవి పాల్గొన్నారు.